


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (46)*

### *ఇంట్లో ప్రహసనాలు*

అపరిశుభ్రాన్ని 'కాక్కు' అనేవాళ్లం పిల్లలదగ్గర. స్నానం చెయ్యడానికి మొరాయిస్తే– కాక్కు పాప, కాక్కు బాబు అనేవాళ్లం పిల్లల్ని. వాళ్లు మాత్రం తక్కువ తిన్నారా– నాకుగానీ, శ్రీమతికిగానీ స్నానం ఆలస్యమైతే కాక్కునాన్న, కాక్కమ్మ అనేవారు. ఎక్కడ వాళ్లలా అనేస్తారోనన్న భయంతో వీలైనంతవరకూ మేమిద్దరం స్నానాలకి ఆలస్యం కాకుండా చూసుకునేవాళ్లం.

పిల్లల ఈ పిలుపు కొంచెం ప్రమాదకరమైనదే.

మాది మంచి షాపింగ్ ఏరియా కదా, ఒకసారి ఇటుగా షాపింగుకొచ్చిన ఓ ఇండియన్ మిత్రుడు ఉదయం పదింటికే మా ఇంటికొచ్చి, ఓ షాపులో కాసెట్ల ఆఫర్ గురించి చెప్పాడు. టిఫిన్ చేసి వెళ్లమంటే, "ఆఫర్ గురించి చెప్పాలనొచ్చాను. నేను వెంటనే వెళ్లాలి. ఇంకా స్నానమవలేదు" అన్నాడు.

బాబు చటుక్కున, "కాక్కంకుల్" అనేశాడు.

ఒకటి– మిత్రుడు హడావుడిలో ఉండి వినలేదు. రెండు– అతడికి తెలుగు రాదు. బ్రతికిపోయాం.

మా ఇంటామె ఒలోముచ్‌కీని పిల్లలకి అమ్మమ్మ అని చెప్పేవాళ్లం. ఆమె నెలల తరబడి స్నానం చెయ్యదని మేమిద్దరం అనుకోవడం విన్న పిల్లలు ఆమెకి కాక్కమ్మమ్మ అని పేరెట్టారు. ఆమెకి భాష రాదు కాబట్టి, ఫరవాలేదులే అని ఊరుకున్నాం.

మావాళ్లొచ్చిన నెల్లాళ్లకి కాబోలు– ఆ ఇంట్లోకి కొత్తగా షేరర్ అనే అరవయ్యేళ్లతను– ఒలోముచ్‌కీ ఉండే పెద్దగదినానుకుని ఉన్న మరో గదిలో చేరాడు. అతడిది కూడా పోలండే. అద్దెకొచ్చాడో, లేక బంధువో మాకు తెలియదు. ఇంటామెకి చేదోడు వాదోడుగా ఉండేవాడు.

ఒలోముచ్‌కీది మహాకాయం. అడుగు తీసి అడుగు వెయ్యడమే పెద్ద అవస్థ ఆమెకి. ఇతగాడేమో సన్నగా, పీలగా ఉన్నాడు. ఆమె పక్కన చూస్తే మరీ పిట్టలా కనిపిస్తాడు. అందుకేనేమో చులాగ్గా, చలాకీగా టీనేజరంత హుషారుగా ఉంటాయి కదలికలు.

ఆమె అతణ్ణి సాయానికి తెచ్చుకుని ఉంటే కనుక ఎప్పుడో ఆ పని చెయ్యాల్సిందనిపించింది. ఎందుకంటే అతడొచ్చినప్పట్నించీ, రోజూ ఉదయం లేచింది మొదలు ఆఫీసుకెళ్లేదాకా 'హెర్ షేరర్' అన్న ఆమె పిలుపు మాకు వినిపిస్తూనే ఉండేది.

ఒలోముచ్‌కీతో మాకంత సాన్నిహిత్యం లేదు కానీ షేరర్ కలుపుగోరు మనిషి. నన్నతడు 'హెర్ డాక్టర్' అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడు. నేనింట్లో ఉండేది తక్కువ కాబట్టి అతడికి నాకంటే ఎక్కువ సాన్నిహిత్యం శ్రీమతితో ఉండేది. ఆమెనతడు 'ఫ్రౌ రావ్' అని పిలిచేవాడు. వంటగదిలో ఉన్నప్పుడు వెళ్లి ఆమెతో కబుర్లు చెప్పేవాడు. జర్మన్–ఇంగ్లీషు కలగలిసిన భాషతో ఇద్దరికీ సంభాషణ బాగానే నడిచేది.

శ్రీమతిని కూతురిగానూ, మా పిల్లలకి తాతగానూ ఫీలయ్యేవాడు షేరర్. ఎప్పుడైతే శ్రీమతి తాత అని చెప్పిందో– అతణ్ణి 'కాక్కుతాత' అనడానికి మా పిల్లలు క్షణం కూడా వృథా చెయ్యలేదు.

శ్రీమతి నొచ్చుకుంది. ఎందుకంటే– షేరర్ తను శుభ్రంగా ఉండడమే కాదు. ఒలోముచ్‌కీ అపరిశుభ్రతమీద కామెంట్సు చేసేవాడు. తను రోజూ స్నానం చేస్తాననీ, ఆమె అన్నాళ్లు స్నానం చెయ్యకుండా ఎలా ఉంటుందోననీ ఆశ్చర్యపడేవాడు.

"ఇనుముతో స్నేహం చేస్తే, అగ్నికి సమ్మెట దెబ్బలు తప్పవు. కాక్కమ్మమ్మకి కావలసినవాడుగా, షేరర్ కాక్కుతాత అయ్యాడనుకో" అని శ్రీమతికి నచ్చజెప్పాను.

షేరర్‌కీ శ్రీమతికీ వంటింటి స్నేహం బాగానే కొనసాగుతోంది. అ సమయంలో అతడు ఒలోముచ్‌కీ భారీకాయంమీద జోక్సు వేసేవాడు. కానీ క్రమంగా ఆ జోక్సు ఎంజాయ్ చెయ్యలేని పరిస్థితి ఏర్పడింది శ్రీమతికి!

జర్మన్ నీళ్లు వంటబట్టడమో, లేక ట్యూబెక్టమీ సైడ్ ఎఫెక్టో, లేక థైరాయిడ్ సమస్యో– తెలియదు కానీ– బక్కగా, పీలగా ఉండే శ్రీమతి బెర్లిన్ వచ్చేక క్రమంగా వళ్లుచెయ్యసాగింది. అది గమనించిన షేరర్ ఆమెతో, "వళ్లు జాగ్రత్త! ఒలోముచ్‌కీకిలా ఐపోగలవు" అని హెచ్చరించాడు. రోజూ వెయింగ్ మెషీన్లో బరువు చూసుకుంటూ ఉండడంవల్ల, ఆ విషయం శ్రీమతికీ స్పష్టమౌతోంది. ఆహార నియంత్రణతో తన ప్రయత్నం తాను చేసినా, బరువుమీద ఏ ప్రభావమూ లేకపోయేసరికి– అసహాయతతో, భారాన్ని దైవంమీదే వేసింది. కానీ దైవం ఆ భారాన్ని తను తీసుకోకుండా ఆమెపైనే వదిలేశాడు.

అదలాగుంచితే షేరర్ వచ్చేక శ్రీమతికి కొత్తగా కొండంత బలం వచ్చినట్లనిపించింది. ఎందుకంటే చాలామంది యూరోపియన్సుకిలాగే అతడికి ఇంటి మెయింటెనెన్సుకి తగిన విద్యలు చాలా వచ్చు.

ఇంట్లో నేను లేనప్పుడు ఒకసారి శ్రీమతి, పిల్లలు రికార్డు చేసిన మావాళ్ల పాటలు–మాటలు వింటుండగా టేపు ఆగిపోయింది. ఏమయిందా అని చూస్తే గదిలో దీపం కూడా వెలగడం లేదు. అంటే కరెంటు పోయింది.

అక్కడ కరెంటు పోవడం కొత్త. పోయిన కరెంటు దానంతటదే వస్తుందో రాదో తెలియదు. ఐనా మా గదిలోనే పోయిందా, ఇల్లంతా పోయిందా అని అనుమానం. అందుకని శ్రీమతి షేరర్‌ని పిలిచి విషయం చెప్పింది.

షేరర్ ఇంట్లో కరెంటుంది. అందుకని అతడు మా గదికొచ్చి చూశాడు. స్విచ్‌బోర్డు పక్కనున్న గోలీకాయ సైజు వస్తువుని బయటికి లాగాడు. ఆ గోళీకి అంగుళం సైజు పొడుగున సన్నని గాజుగొట్టాముంది. అతడు దాన్ని పరీక్షగా చూసి, "ఫ్యూజు. పోయింది" అని అక్కడ పెట్టేసి వెళ్లిపోయాడు.

ఇండియాలో ఫ్యూజు పోతే– మార్చడానికి జరిగే తతంగం గుర్తుకొచ్చి శ్రీమతికి గుండె గుభేల్మంది.

ముందు ఇంట్లో ఫ్యూజు వైరుండాలి. ఉన్నా మనమే మార్చాలంటే ఫ్యూజు సాకెట్ అంతెత్తున ఉంటుంది. అందుకుందుకు నిచ్చెన ఉండాలి. లేదా ఎలక్ట్రీషియన్ వచ్చి చూసేదాకా అసహాయంగా ఎదురుచూడాలి.

ఒకవేళ ఫ్యూజు ఇంట్లోకాక బయట స్తంభంమీద పోయుంటే, లైన్‌మాన్ రావాల్సిందే! ఆ లైన్‌మాన్ రావడానికి గంటలే కాదు, ఒకోసారి రోజులు కూడా పట్టొచ్చు.

జర్మనీలాంటి అత్యాధునిక దేశంలో కూడా ఫ్యూజు సమస్య ఉంటుందని ఆమె ఊహించలేదు. ఇప్పుడది తీరాలంటే నేను ఆఫీసునుంచి రావాలి. వచ్చేక అప్పుడు సమస్యకు పరిష్కారం చూడాలి. ఆ పరిష్కారం ఇంట్లో ఉంటుందా, ఇంటి బయటుంటుందా అన్నది తెలియదు!

ఆమె ఇలా ఆలోచనలతో సతమతమౌతుండగా షేరర్ మళ్లీ వచ్చాడు. అతడి చేతిలో ఇందాకటిలాంటి ఫ్యూజ్ ఒకటుంది. పాత ఫ్యూజుని తీసిన చోట దీన్ని గుచ్చాడు. అంతే, కరెంటు వచ్చేసిందనడానికి సూచనగా మధ్యలో ఆగిన టేపు తిరగడం మొదలైంది.

"నా దగ్గర స్పేర్ ఫ్యూజు ఉంటే తెచ్చాను. మీరు కూడా ఇలాంటివి కొన్ని కొని ఇంట్లో ఉంచుకోండి. ఫ్యూజు పోతే మీరే మార్చుకోవచ్చు" అన్నాడు షేరర్.

'ఫ్యూజు మార్చడం ఇంత సులభమా? ఇండియాలోనూ ఇలాంటి సదుపాయముంటే ఎంత బాగుణ్ణు?' అనుకున్న శ్రీమతి మరోసారి జర్మనీ ఆధునికతని గుర్తించింది.

ఆమె షేరర్‌కి థాంక్సు చెబితే, అతడు వేలు పైకి చూపించి, "బల్బు వెలగలేదు. బహుశా మాడిపోయుంటుంది. నా దగ్గర స్పేర్ బల్బు ఉంది. తెచ్చి మారుస్తాను" అని వెళ్లి ఓ బల్బు తెచ్చాడు.

బల్బు గది కప్పుకి ఉండడంవల్ల, అందుకుందుకు కుర్చీ ఒకటి తెచ్చి వేసుకుని, దానిమీదకి ఎక్కాడు. కానీ అతడికి అది అందీ అందనట్లుంది. అతడు కుర్చీ దిగి, "నాకు అందడం లేదు. మీ ఆయన పొడగరి కదా! తనొచ్చేక మార్పించుకో" అని వెళ్లిపోయాడు.

సాయంత్రం నేనింటికొచ్చేక శ్రీమతి జరిగింది చెప్పి, పగలబడి నవ్వింది.

ఒక జర్మన్ వ్యక్తిచేత పొడగరి అనిపించుకున్నందుకు నాలో పుట్టిన గర్వాన్ని– ఆమె నవ్వులోని చిలిపితనం అణగద్రొక్కింది.

నేను మరీ పొట్టివాణ్ణి కాకపోవచ్చు. కానీ పొడగరి అనిపించుకునే అవకాశం ఏమాత్రం లేనివాణ్ణి. అలాంటి నన్ను- షేరర్ పొడగరి అన్నాడు. అలా చిన్నగీత పెద్దగీత అయింది.

అదే ఆమె నవ్వుకి కారణం మరి! నవ్వింది భార్య కాబట్టి, వినోదంగా స్వీకరించి ముచ్చటపడడం నా అసహాయత!

కానీ ఒకోసారి వినోదానికి విషాదం కూడా జతపడుతూంటుంది. అలాంటప్పుడు వినోదానికి ముచ్చట పడలేకపోవడం అసహాయత!

ఉదాహరణకి పెద్దవాళ్లెవరైనా కుర్చీలోంచి కిందపడితే, నవ్వు రావడం పిల్లలకు సహజం. నవ్వలేకపోవడం వాళ్ల అసహాయత.

నేను, శ్రీమతి పిల్లలం కాకపోయినా అలాంటి ప్రహసనం ఒకటి జరిగింది. అదీ స్నానాల గదిలో....

*స్నానాల గదిలో*

ఒక రోజు మాకు స్నానాల గదిలోంచి 'హెర్ షేరర్, హెర్ షేరర్' అన్న పిలుపులు మా గది తలుపుల్ని ఛేదించుకుని మరీ వినిపించాయి.

అది ఒలోముచ్‌కీ కంఠస్వరం. ఏమయిందోనని కంగారుపడి ఇద్దరం బయటికెడితే, స్నానాల గది తలుపు మూసి ఉంది. ఆమె మరోసారి 'హెర్ షేరర్' అంది. ఈసారది అరిచినట్లే ఉంది.

నేను పరుగున షేరర్ గదికి వెళ్లి తలుపు తట్టాను. అతగాడు తలుపు తీసి, ఏమయిందని అడిగేలోగానే మరోసారి, "హెర్ షేరర్" అన్న ఒలోముచ్‌కీ గొంతు వినిపించింది. ఈసారది ఆర్తనాదంలా ఉంది.

షేరర్‌కి పరిస్థితి అర్థమై ఒక్క ఉదుటున తలుపువద్దకెళ్లి, ముందు తలుపు తియ్యమని గట్టిగా అన్నాడు.

ఆమె తలుపు తీసే పరిస్థితిలో లేదు. స్నానం చేస్తూ బాత్‌టబ్బులో పడిపోయిందిట. పైకి లేచి రాలేకపోతోంది.

అప్పుడు షేరర్ నావైపు తిరిగి, విషయం చెప్పి, "ఆమెను బయటికి లాగడం నావల్లనేమౌతుంది. నీ సాయం కావాలి" అన్నాడు.

నేను తటపటాయిస్తూ, "స్నానాలగదిలో ఆమె ఏ స్థితిలో ఉందో! మగాళ్లం మనం లోపలికెడితే ఏం బాగుంటుంది? పక్కిళ్లలో కాస్త భారీగా ఉండే ఆడవాళ్లుంటే సాయమడుగుదాం" అన్నాను.

షేరర్ నవ్వి, "ఇలాంటప్పుడు ఆడవాళ్లు ఆడవాళ్లవద్దే ఎక్కువ సిగ్గు పడతారు. అందుకే ఫ్రౌ రావు సాయం కూడా తీసుకోదు. ఐనా మనవల్ల కానప్పుడే పక్కవారి సాయమడగాలి. తటపటాయించకు. ఒలోముచ్‌కీది పెద్ద వయసు. తల్లిలాంటిదనుకో" అని నచ్చజెప్పాడు.

ఏమనుకుందో శ్రీమతి వెంటనే గదిలోకెళ్లిపోయింది. నేనిక కార్యోన్ముఖుణ్ణై, "ఇంతకీ గది తలుపులు తీసేదెలా?" అన్నాను.

షేరర్ స్నానాల గదిలోకి వినిపించేలా, "కంగారు పడకు. సాయానికి నేను, రావ్ వస్తున్నాం" అని చెప్పి తన గదిలోకి వెళ్లి– ఓ స్క్రూడ్రైవర్, చిన్న సుత్తి, పట్టకారు తెచ్చుకొచ్చాడు. వాటినుపయోగించి తలుపు తాళం దగ్గర కాసేపు తంటాలుపడి మొత్తంమీద తలుపు తెరుచుకునేలా చేశాడు. కానీ వెంటనే తెరవలేదు.

"నువ్వు చాలా పనిమంతుడివి. ఇలా తలుపు తియ్యడం అందరికీ సాధ్యం కాదు. నిన్ను ఒలోముచ్‌కీ బాగా మెచ్చుకుంటుంది" అన్నాను.

"ఏమో, తాళాలు తీసే నా నేర్పుకి భయపడి, ఇంట్లోంచి పొమ్మన్నా పొమ్మనగలదు" అని నవ్వాడు షేరర్.

ముందు షేరర్, వెనుకనే నేను– ఇద్దరం నెమ్మదిగా స్నానాలగదిలో అడుగెట్టాం.

అక్కడ చూస్తే–

బాత్‌టబ్బులో అసహాయంగా వెల్లకిలా పడుంది ఒలోముచ్‌కీ. మహాకాయంతో– శ్రీకృష్ణలీలలు సినిమాలో, కృష్ణుడికి పాలిచ్చి పడిపోయిన పూతనలా ఉందామె. తేడా అల్లా ఈమె వంటిమీద బట్టల్లేవు.

తలుపు వెనుక భాగానికి తగిలించి పెద్ద బొచ్చుతువ్వాలొకటుంటే తీసి షేరర్‌కి అందించాను. కానీ అదామె వంటికి జేబురుమాలు కంటే తక్కువ. అందుకనేమో షేరర్ వెంటనే దాన్ని మళ్లీ తలుపుకి తగిలించి, 'ముందామెను టబ్బులోంచి లేపాలి. పద' అన్నట్లు చూశాడు.

ఇబ్బందిగానే ముందుకు కదిలి ఆమె భుజం పట్టుకుందుకు వంగి అప్రయత్నంగా ఆమె మొహంలోకి చూశాను. అప్పుడామె నావైపు చూసిన చూపులు జీవితంలో మర్చిపోలేను. దీనంగా ఉన్న ఆ చూపుల్లో అసహాయత ఉంది. ఆ అసహాయతలో అమ్మతనం కనిపించింది. ఆ తర్వాత నాకామె వళ్లు కనిపించలేదు. అమ్మతనమున్న ఆ చూపులే నా మెదడులో ప్రతిష్ఠించుకున్నాయి.

ఆమె మా ఆసరాతో ముందు బాత్‌టబ్బులో ఎలాగో లేచికూర్చుంది. మా ఆసరాతోనే టబ్బు బయటికొచ్చింది. ఒకసారి లేచి నిలబడ్డాక ఆమెకిక మా అవసరం లేదు. అది గ్రహించగానే నేనక్కణ్ణించి కదిలాను.

"డాంకే షోన్ హెర్ డాక్టర్" అని ఆమె అనడం వినిపించింది కానీ, వెనక్కి తిరక్కుండానే, "బిట్టే షోన్" అని వెళ్లిపోయాను.

ఆమెను గదిలో చేర్చాక షేరర్ వచ్చి నన్ను పిలిచి తనూ ఒలోముచ్‌కీ తరఫున థాంక్స్ చెప్పాడు. తన భుజం తడుముకుంటూ, "నీకూ భుజం నొప్పి చేసిందా?" అన్నాడు నవ్వుతూ.

అప్పుడు అతడిలో చిన్నపిల్లాడి మనస్తత్వాన్ని చూశాను. పర్వతంలాంటి శరీరంతో ఆమె టబ్బులో పడిపోయిన దృశ్యం అతడికి నవ్వు తెప్పిస్తోంది. ఎలాగో ఆపుకుంటున్నాడు.

"వయసు వల్లకాదు. ఇంత లావుండడంవల్లనే" అని లావుని రెండు చేతుల్నీ బాగా ఎడం చెయ్యడం ద్వారా అభినయించి, "తనకిలా అయింది. మనమున్నాం కాబట్టి సరిపోయింది కానీ, ఒక్కర్తీ ఉండగా అలా పడిపోతే ఏమయ్యేది?" అన్నాడతడు.

తలచుకుంటే నాకూ భయమేసింది. పాపం, ఏమయ్యేదో మరి– అనుకుంటూ, నేనీ ఉదంతాన్ని శ్రీమతితో పంచుకుని, "అంత లావు మనిషిని మేమిద్దరం టబ్బులోంచి ఎలా లేపామోనని ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంది" అన్నాను.

ఐతే కాక్కమ్మమ్మ టబ్బులో పడిపోయిన విషయం పిల్లలకు చెప్పకూడదని ఇద్దరం అనుకున్నాం. ఎందుకంటే శ్రీమతికి చెబుతున్నప్పుడే ఆమెకీ, నాకూ కూడా నవ్వాపుకోవడం కష్టమైంది. ఇక పిల్లల్ని నవ్వకుండా వాళ్లను ఆపలేం కదా!

విషాదం కలిసిన ఇలాంటి వినోదాల్ని ముచ్చట్లుగా గుర్తించలేని అసహాయత– ఇంట్లోనే కాదు, ఆఫీసులోనూ పలు సందర్భాల్లో కలిగింది నాకు. గతంలో కొన్నింటిని చెప్పుకున్నాం. ఇప్పుడు మరికొన్ని....

***ఆఫీసులో ప్రహసనాలు***

'మా వంటిరంగు తెలుపు గొప్పది. మేము పాటించే సంప్రదాయం గొప్పది. మా జీవనవిధానం గొప్పది. మిగతావారంతా అన్నింటా మాకంటే తక్కువే"

ఇలాంటి భావం తెల్లవారికి మనసులో ఏమూలో ఉంటుంది. కొందరు బయటపడతారు. కొందరు బయటపడరు.

ఇది వారితో సాన్నిహిత్యమున్న చాలామంది చెప్పేమాట!

ఇప్పుడు నాకూ కొంత స్వానుభవమున్నా, నేనందుకు తెల్లవారిని తప్పు పట్టను. ఎందుకంటే మన దేశంలో ప్రజాస్వామ్యం వచ్చినా కూడా కులాహంకారం రాజ్యమేలుతోంది.

తెల్లవారు వైజ్ఞానికంగా ప్రగతిని సాధించి, ఎదుటివారి బలహీనతలని సొమ్ము చేసుకుని సంపన్నులై– సమర్థులుగా పేరు గడించారు. వారి ఆధిక్యత వెనుక చెప్పుకోతగ్గ కృషి ఉంది. కానీ కులాధిక్యత జన్మసిద్ధం. అది ఏ కృషీ లేకుండా ఆయాచితంగా లభించినది. చట్టవిరుద్ధమైనా కొనసాగుతున్నది. మనం దాన్నించి బయటపడేదాకా– మనం చూపేది ఒక వేలైతే, మనని చూపేవి నాలుగు వేళ్లు.

కాబట్టి కనీసం బయటపడనంతకాలం వారి ఆధిక్యభావాన్ని సహించొచ్చునని స్వాభిప్రాయం.

పాశ్చాత్య దేశాల్లో ఎక్కువమంది కమ్యూనిజానికి బద్ధవ్యతిరేకులు. అప్పట్లో కమ్యూనిస్టు ప్రభుత్వమున్న అగ్రదేశం సోవియట్ రష్యా అంటే వారికి బొత్తిగా కిట్టేది కాదు. రష్యాతో చెలిమి చేస్తున్నదని అప్పటి ఇండియా ప్రధాని ఇందిరాగాంధీ వారికి బొత్తిగా నచ్చేది కాదు. నావద్ద ఆమెను తరచుగా విమర్శించేవారు. వారి విమర్శలో తర్కంకంటే, ద్వేషమే ఎక్కువ ఉండడం వల్ల నేను తర్కంతో వాళ్లని ఎదుర్కునేవాణ్ణి. వారి విమర్శలు వారికే తగిలేలా మళ్లించేవాణ్ణి. ఏమనాలో తెలియక, "నువ్వు ఇందిరా గాంధీ అభిమానివి" అని ముద్ర వేసేశారు.

నేనది తేలికగా తీసుకుని, "అలాగని ఓ రిపోర్ట్ రాసి, ఇండియాకు పంపండి. నా ప్రమోషన్‌కి ఉపయోగపడుతుంది" అన్నాను.

అది వాళ్లకి బాగా గుర్తుండిపోయినట్లుంది. బహుశా వాళ్లలో వాళ్లు చర్చించుకునేవారేమో కూడా!

మా లాబ్‌లో ఇంజనీరింగ్ వర్క్‌షాప్ హెడ్ బెర్గర్ తన పనేదో తనది అన్నట్లుంటాడు. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడడు. నా కెటలిటిక్ రియాక్షనుకి రియాక్టరు డిజైన్ చేసి తయారు చేసింది అతడే! ఐనా మేమిద్దరం టెక్నికల్ పాయింట్లే తప్ప మరేం మాట్లాడుకునేవాళ్లం కాదు. మరో విశేషం అతడు షేరర్ లాగే సన్నగా, పీలగా ఉంటాడు. నాకంటే కొంచెం పొట్టి.

ఒకరోజు నేను ఆఫీసులో అడుగెట్టగానే అక్కడే ఉన్న బెర్గర్ చటుక్కున నన్ను పలకరించాడు. అంతకంటే ఆశ్చర్యం, "నువ్వు ఇండియా వెడితే, ఇందిరాగాంధీ ప్రమోషనివ్వదు. నీ చేతులకి సంకెళ్లు వేసి జైల్లో పెడుతుంది" అన్న అతడి మాట.

జరిగిందేమిటంటే ఇండియాలో ఎమర్జన్సీ విధించబడింది. అది ఇక్కడి వార్తల్లో ప్రచారధోరణిలో ప్రసారమై ఉంటుంది.

బెర్గర్ తర్వాత మరికొందరు మిత్రులు పలకరించి, ఇందిరాగాంధీ నియంతృత్వాన్ని నిరసించారు. "నువ్విక్కడే ఉండిపోయే ప్రయత్నం చెయ్యి. అక్కడ నీకు భవిష్యత్తు లేదు" అన్నారు కొందరు.

"బ్రిటిష్ వాళ్లు ఏలుతున్నప్పుడే, సామాన్యులు మామూలుగా జీవించారు. ఈ ఎమర్జన్సీలూ అవీ ఎక్కువగా ఇబ్బందిపెట్టేది రాజకీయ వాదుల్నీ, పారిశ్రామికవేత్తల్నీ, ఎదురు తిరిగే మనస్తత్వం ఉన్నవారినీ వగైరా వగైరా. నేను మామూలు మనిషిని. సగటు భారతీయుణ్ణి. నాకు వర్తమానమే ప్రధానం. భవిష్యత్తు వర్తమానంగా మారుతుంది కదా, అప్పుడు దాని గురించి ఆలోచిస్తాను" అని వాళ్లకి సమాధానం ఇవ్వడం కోసం తోచింది చెప్పేశాను.

"ఇంతకీ నువ్వు ఎమర్జన్సీని సమర్థిస్తావా? వ్యతిరేకిస్తావా?" నిలదీశాడు హైనర్ డెకర్ట్.

"నా మాటకి విలువుంటేనే దాని గురించి ఆలోచిస్తాను, మాట్లాడతాను" అన్నాను తప్పించుకుందుకు.

"భారతీయుల్లో నీలాంటివాళ్లు ఎక్కువ కాబట్టే, అక్కడ ఇందిరాగాంధీలాంటివాళ్ల ఆటలు సాగుతున్నాయి" అన్నాడు కిర్ష్‌నర్.

"మా దేశంలో నాలాంటివాళ్లు ఎక్కువైతే ఎలాగుండేదో చెప్పలేను కానీ, మేము జనాభాలో అత్యల్పశాతం. ప్రజాస్వామ్యమంటే అర్థంకాని నిరక్షరాస్యులు, ముందుచూపులేని అమాయకులు– వీరిదీ అక్కడ అత్యధిక మెజారిటీ. ఒక సీసా మద్యానికీ, ఒక పొట్లాం తిండికీ తమ ఓటుని అమ్ముకుంటారు వాళ్లు. వాళ్ల ఓట్లే దేశం భవిష్యత్తుని నిర్ణయిస్తాయి. మాలాంటివాళ్లు గళం విప్పితే కేవలం కంఠశోషే. ఐనా కొందరు శోషించి అలసిపోతుంటారు. మౌనం వహిస్తే అలసట ఉండదు. అంతే!" అన్నాను.

అది అసహాయతతో నిండిన ఆక్రోశం. ఐతే నా ఆక్రోశాన్ని అక్కడివాళ్లు వినోదిస్తున్నారని తెలుసు.

ఇంతకీ ఎమర్జన్సీ అంటే ఏమిటో అంతవరకూ తెలియదు నాకు. దాని గురించిన వార్తలు ఇండియన్ న్యూస్ సర్వీసునుంచి ఒకలాగా, బీబీసీ నుంచి మరొకలాగా వినిపిస్తున్నాయి. నిజం ఆ రెంటికీ మధ్యన ఉంటుందని తెలుసు. కానీ ఎంత మధ్యనో తెలియదు.

ఆ సమయంలో ఇండియాలో లేకపోవడం ఒకవిధంగా నా అదృష్టం. ఇక్కడ నా రీసెర్చి నిరాటంకంగా కొనసాగుతోంది. ఆఫీసులో కూడా ఎమర్జన్సీ గురించి ఆ తర్వాత చర్చలు జరుగలేదు.

నేను తయారు చేసిన కెటలిస్టులు ఐరన్–క్రోమియం రసాయనాలు. అవి వాటర్ గాస్ షిఫ్ట్ రియాక్షన్‌కి ఎలా పనిచేస్తాయో చూడ్డానికి ఇక్కడికొచ్చాను. ఆ రియాక్షన్లో కార్బన్ మోనాక్సైడ్, నీటి ఆవిరి కలిస్తే– కార్బన్ డయాక్సైడ్, హైడ్రోజన్ గ్యాస్ వస్తాయి. ఎన్నో ముఖ్యమైన పరిశ్రమలకి ఆలంబనగా ఉండే ఫిషర్–ట్రోప్ష్ ప్రోసెస్‌కి– వాటర్ గాస్ షిఫ్ట్ రియాక్షను కూడా ముఖ్యమైనది.

ఆయా రియాక్షన్లకి సంబంధించిన కెటలిస్టుల పరిశోధనలో ప్రొఫెసర్ క్యోల్బెల్ అగ్రగణ్యుడు. ఆయన నేనుండే సంస్థలోనే ప్రొఫెసరు. నా పరిశోధనకోసం మొదట ఉత్తరం వ్రాసినది ఆయనకే. తను రిటైరైపోయాననీ, తన శిష్యుడు రాలెక్ వద్ద చేరమనీ, ఆయన చెప్పేకనే, నేను ప్రొఫెసర్ మిలోస్ రాలెక్‌కి ఉత్తరం వ్రాయడమూ, ఆయన అనుమతించడమూ జరిగింది.

వెళ్లింది డాడ్ స్కాలర్‌షిప్ మీద. ఆ స్కాలర్‌షిప్ మీద వెళ్లినవారు ఉండే 16 నెలల్లోనూ, నాలుగు నెలలు– జర్మన్ భాష నేర్చుకుందుకే పోతుంది.

ఏడాదిలో ఎంత రీసెర్చి చేస్తారులే అని అక్కడి ప్రొఫెసర్లు డాడ్ స్కాలర్సుని సీరియస్‌గా తీసుకోరు. ఆధునిక పరికరాలతో పరిచయం, రీసెర్చికి సంబంధించిన సమాలోచనలు చాలనుకుంటారు. అదికాక సైట్ సీయింగ్. ఏడాదిట్టే గడిచిపోతుందని వారి భావన.

నేను బెర్లిన్ వెళ్లేక సైట్ సీయింగుకి వెళ్లింది లేదు. లాబ్‌కెళ్లడం మానింది లేదు. ఎందుకంటే ఇక్కడున్న సైంటిఫిక్ అడ్మినిస్ట్రేషనుతో, ఆధునిక సదుపాయాలతో– ఇండియాలో ఏళ్లు పట్టే పని, ఇక్కడ నెలల్లో ఐపోతుందని వెళ్లిన మరుక్షణమే తెలియడంవల్ల– మొదట్నించీ సీరియస్‌గానే ఉన్నాను.

నా శ్రద్ధాసక్తుల్ని రాలెక్ తొందరగానే పట్టేశాడు. ఆయనొకరోజు నన్ను పిలిచి, “నీ ప్రాజెక్ట్ నాకు నచ్చింది. ప్రోగ్రెస్ కూడా బాగుంది. ఏడాదే ఉంటే– చేసింది మధ్యంతరంగా వదిలి వెళ్లాల్సి ఉంటుంది. అదనంగా ఇంకో ఏడాది ఉండగలవా?” అనడిగాడు.

ఆశ్చర్యపోయాను. అంతకుముందు వెళ్లిన డాడ్ స్కాలర్సు కొందరు చెప్పిందాన్ని బట్టి, కారణాలేమైనా చాలామంది మనవాళ్లు అక్కడ మరికొన్నాళ్లు ఉండాలని ప్రయత్నిస్తారు. అందుకు ప్రొఫెసర్ని ఒప్పించడం చాలా కష్టంట. బ్రతిమాలో బామాలో ఒప్పిస్తే చాలామందికి మూడు నెలలూ, కొందరికి ఆరు నెలలూ, అతికొద్దిమందికి ఏడాదీ ఎక్స్టెన్షన్ రావచ్చుట.

అలాంటిది– ప్రొఫెసరే నన్ను స్టే ఎక్స్టెండ్ చెయ్యమనడం, అదీ ఏకంగా ఏడాదికి– చెప్పొద్దూ నాకు ఆశ్చర్యంతోపాటు గర్వాన్నీ కలిగించింది.

ఐతే నా ఇబ్బందులు నాకున్నాయి. అనుకున్న ప్రకారం అక్టోబర్లో ఇండియాకి వెడితే అప్పటికి పాపకి 5, బాబుకి మూడున్నరేళ్లు ఉంటాయి. 1976 జనవరికి ఇద్దర్నీ స్కూళ్లలో వెయ్యొచ్చు. అప్పుడు భువనేశ్వర్లో ఇంగ్లీషు మీడియం స్కూల్సు– జనవరి–డిసెంబర్ సిస్టం అనుసరించేవి.

నేను మరో ఏడాది ఇక్కడుంటే మా పిల్లలు చదువులో ఆమేరకి వెనుకబడిపోతారు.

తనే అడిగినప్పుడు కాదనడం బాగుండదు కదా, అందుకని ఓ మూణ్ణెల్లు ఎక్స్టెన్షన్ తీసుకుంటే, జనవరికి వెళ్లొచ్చు కదా అనుకుని, ఆ మాట ఆయనకి చెప్పాను.

రాలెక్కి నచ్చలేదు. మూణ్ణెల్ల ఎక్స్టెన్షనూ ఓ ఎక్స్టెన్షనేనా అన్నాడు– ఏదో సినిమాలో సూర్యకాంతం, 'మేనత్త కొడుకూ ఓ మొగుడేనా?' అన్నంత నిరసనగా.

చివరికాయన నన్ను ఆర్నెల్లైనా ఉండమన్నాడు.

పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడంవల్ల కానీ, జర్మనీలో మరికొన్నాళ్లు కొనసాగడానికి చేదా ఏమన్నానా?

ఏమైతే అయిందిలే అని సరేనన్నాను.

రాలెక్కూ, నేనూ అనుకుంటే సరిపోదు. మా ఇద్దరికీ ఓ క్లారిటీ వచ్చేక ఈ ఎక్స్టెన్షనుకో తతంగం ఉంది. ముందు డాడ్ ఆఫీసు అనుమతించాలి. వాళ్లు సాధారణంగా అందరికీ అనుమతి ఇవ్వరు.

ఆ మాటే చెబితే, "నీవైపునుంచి నువ్వు ఉత్తరం రాయి. నేను వాళ్లతో మట్లాడతాను" అన్నాడు రాలెక్.

నిజానికాయన మాట్లాడనవసరంలేదు. ఉత్తరంతో పాటు నేను అంతవరకూ అక్కడ రీసెర్చిలో నా ప్రోగ్రెస్ తెలియబరుస్తూ, ఎక్స్టెన్షన్ ఎందుకు అవసరమో సమర్థించుకోవాలి. ఆ రిపోర్టుమీద రాలెక్ సంతకం ఉండాలి.

ఇంగ్లీషులో ఐతే అలాంటి ప్రోగ్రెస్ రిపోర్టులు నాకు కరతలామలకం. కానీ అది జర్మన్ భాషలోనే ఉండాలని రాలెక్ పట్టుబట్టాడు.

నాకు జర్మన్ కొంత వచ్చు. అది జర్మన్ మిత్రులకు ఉత్తరాలు వ్రాయడానికి పనికొస్తుంది కానీ, ఇలాంటి టెక్నికల్ రిపోర్ట్సుకి సరిపోదు.

అదే రాలెక్కి చెప్పాను. "ఫ్రెండ్సు సాయం తీసుకో. ఆపైన నేనున్నాను" అన్నాడాయన.

ఇలాంటి విషయాల్లో నాకు సాయపడేది హైనర్ డెకర్టే మరి.

వెళ్లి అడిగాను. అతడు వెంటనే, "ఇదివరలో నీకు నేను నీ భార్య రెసిడెన్స్ పర్మిట్ కోసం జర్మంలో ఉత్తరం రాయడానికి సాయం చేశాను. కానీ ఇది టెక్నికల్ రిపోర్టు. అదీ రాలెక్ అప్రూవల్ కోసం. నీకు రాలెక్ సంగతి తెలియదు. ఆయన్ని మెప్పించేలా టెక్నికల్ రిపోర్ట్స్ రాయడం చాలా కష్టం. తీరా రాసేక, అదాయనకి నచ్చకపోతే నామీద ఇంప్రెషన్ పోతుంది. నా గురించైతే ఎలాగూ తప్పదు కానీ, నీ గురించి నామీద ఇంప్రెషన్ ఎందుకు పోగొట్టుకోవాలి?" అన్నాడు.

డెకర్ట్‌కి హిపోక్రసీ లేదు. ఉన్నదున్నట్లు చెప్పాడు. కాదనడానికేం లేదు.

మరిప్పుడు నేనేం చెయ్యాలి?

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments